## 27న రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

జగద్గిరిగుట్ట: పోలాలబస్తీ మగ్దూం నగర్‌లో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమంలో ఉదయం 5 గంటలకు గంగా సేకరణ, గంగ గౌరి పూజలు, పుణ్యావచనం, కంకణదారణ, విగ్రహ జలాదివాసం, నవగ్రహ, దేవి మూలమంత్ర హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, బలిహరణ, పూర్ణహుతి, మహా మంగళనిరాజనం, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, శాక బోనాల అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## డిప్యూటీ స్పీకర్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

రంగారెడ్డినగర్: డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్‌ను రంగారెడ్డినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. 22న రంగారెడ్డినగర్‌లో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే పలహార బండి ఊరేగింపు కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో పెండ్లి భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణముదిరాజ్, అక్షయ ముదిరాజ్, లలిత్ వర్మ పాల్గొన్నారు.

## స్వర్ణ పుష్పార్చన



జగద్గిరిగుట్ట: చింతల్, పద్మా నగర్ ఫేజ్1 లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్కు స్థలం కబ్జా!



ధ్వంసమైన పార్కు

సినిమాలో సీన్ లాగా పట్ట పగలు ప్రజలంతా చూస్తుండగానే ఒక్క సారి యాభై మంది వరకు బౌన్సర్‌లు వాహనాల్లో చేరుకుని పార్కును మొత్తం ధ్వంసం చేశారు. ఈ సంఘటనను చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మున్సిపల్ అధికారులకు, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎవ్వరు కూడా వారిని పూర్తి స్థాయిలో అడ్డుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బృందావన్ హిల్స్ కాలనీ ప్రజలు తమ పార్కును కాపాడాలని వేడుకుంటున్నారు.

**50 మంది బౌన్సర్‌లతో పార్కును ధ్వంసం చేసిన కబ్జాదారులు**

- అధికారులకు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు
- పార్కును సంరక్షించాలని బృందావన్ హిల్స్ కాలనీ ప్రజల నిరసన

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ బృందావన్ హిల్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తమ కాలనీకి పార్కు కోసం కేటాయించాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో కలెక్టర్ బాచుపల్లి మండల రెవెన్యూ అధికారుల ప్రాథమిక నివేదిక ప్రకారం ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 93లో 23 గుంటల స్థలాన్ని (2,760 గజాలు) పార్కు కోసం కేటాయిస్తూ 2020లో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కుకు ప్రహరి నిర్మించి పార్కును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ పార్కును స్థానికులు అభివృద్ధి చేసుకున్నారు. తమ సొంత నిధులతో సైతం పార్కు అభివృద్ధి కోసం స్థానికులు కృషి చేశారు.

### సర్వే నంబర్ 94 పేరుతో..

పార్కు ఏర్పాటు చేసిన స్థలం సర్వే నంబర్ 94కు చెందిందని పలువురు పత్రాలు పట్టుకుని పార్కు స్థలం తమదని రంగంలోకి దిగారు. ఈ పార్కుపై కన్నేసిన పలువురు వివిధ రకాలుగా కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 14న పెద్ద సంఖ్యలో బౌన్సర్లు చేరుకుని పార్కును ధ్వంసం చేశారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ భాను అక్కడికి చేరుకుని పనులు నిలిపివేశాడు. ఆ అధికారి వెళ్లిన తరువాత తిరిగి పార్కులో తమ విధ్వంసం కొనసాగిస్తుండంతో సమాచారం అందుకున్న ఆర్ఐ తిరిగి పార్కు వద్దకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పోలీసులకు ఫిర్యాదు చేశాం



బృందావన్ హిల్స్ పార్కు కబ్జా ప్రయత్నంపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశఋాం. పార్కు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. పార్కును ప్రజల అవసరాల కోసం వినియోగించే విధంగా కృషి చేస్తాం.

– సాబేర్ అలీ, కమిషనర్ నిజాంపేట్



పార్కును కాపాడాలని నిరసన తెలియజేస్తున్న స్థానికులు

### పార్కును కాపాడాలి



2014లో తాము ఇక్కడ ఫెన్సింగ్ వేసి ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పార్కుగా కేటాయించాలని కలెక్టర్‌కు పలు మార్లు విన్నవించాం. చివరకు మా ప్రయత్నం ఫలించి 2020లో జిల్లా కలెక్టర్ తమకు పార్కు కోసం ఈ స్థలం కేటాయిస్తూ ప్రొసిడింగ్స్ ఇచ్చారు. రాత్రి సమయాల్లో కొందరు బయటి వ్యక్తులు వచ్చి పార్కును ధ్వంసం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ పార్కును కాపాడేందుకు చొరవ చూపాలి. అదే విధంగా గతంలో ఉన్న మాదిరిగానే పార్కును ఏర్పాటు చేయాలి.

– చంద్రశేఖర్, బృందావన్ హిల్స్

### పార్కు కోసం ఎంతో శ్రమించాం



ఈ పార్కు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ చాలా కాలం తిరిగి సాధించుకున్నాం. ఇక్కడ తాము పార్కు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. అకస్మాత్తుగా పార్కును కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసం.

– రాజ్యలక్ష్మి

### కబ్జా నుంచి కాపాడాలి



పబ్లిక్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కును సర్వే నంబర్ మార్చి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ పార్కు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి చిక్కులు లేకుండా తమకు న్యాయం చేయాలి. స్థానిక ప్రజల అవసరాలను అధికారులు, ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి.

– శైలజ

## అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్**

కుత్బుల్లాపూర్: అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ బీహార్ గల్లీ – సీసీల బస్తీ ప్రధాన రహదారి, సోమయ్య నగర్ బస్తీలలో రూ. 30 లక్షల చేపట్టిన సీసీ రోడ్డును కార్పొరేటర్ జగన్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, నాయకులు జైహింద్, లక్ష్మీనాయక్, హాజీ, వెంకటేష్, లక్ష్మయ్య, జయ కృష్ణ, సీతమ్మ, బీహార్ బస్తీ అధ్యక్షుడు ముఖేష్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన కాలనీ కమిటీ**

ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ విప్ వివేకానంద్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో శ్రీకృష్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీని అభినందించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు నర్సింహులు, కోశాధికారి చంద్ర శేఖర్, సంయుక్త కార్యదర్శులు చిరంజీవి, కురుమూర్తి, నరేందర్ నాయుడు, పి.నందు, చంద్రశేఖర్, కార్యనిర్వహక కార్యదర్శి వెంకటేశం, శేఖర్, శ్రీహరిగౌడ్, ప్రభాకర్, సుబ్రమణ్యం, ఆంజనేయులు, రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న మల్లారెడ్డి

దుండిగల్: సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. శనివారం యూత్ ఫర్ సేవ, సర్వీస్ నౌ ఆధ్వర్యంలో బౌరంపేట, మల్లంపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పీసరి కృష్ణారెడ్డి, సతీష్ రంగంపేట, కార్తీక్, రాంరెడ్డి, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ఆంజనేయులు, బాబు, అందె అశోక్, నర్సింగ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో మహిళపై దాడి

దుండిగల్: ఓ మహిళపై సైకో దాడి చేసి ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది.. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటన శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గాగిల్లాపూర్‌కు చెందిన చైతన్య తాగుడుకు బానిసయ్యాడు. గతంలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను వేధించిన ఘటనలో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాడు. ఇతనిపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో సైతం కేసు నమోదైంది. గురువారం గాగిల్లాపూర్‌లో మద్యం మత్తులో ఓ మహిళతో గొడవకు దిగాడు. అందరూ చూస్తుండగానే సదరు మహిళ భర్త ముందే ఆమె జుట్టు పట్టుకుని స్థానికంగా ఉన్న మద్యం దుకాణం వద్దకు ఈడ్చుకెళ్లాడు. అంతే కాకుండా అడ్డొచ్చిన వారిపై దుర్భషలాడాడు. దీంతో బాధిత మహిళ భర్త దుండిగల్ పోలీసులను ఆశ్రయించడంతో సీఐ సతీష్ నేతృత్వంలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. దీంతో నిందితుడు తండ్రి, బంధువులు బాధిత మహిళ కుటుంబాన్ని నివాసముంటున్న ఇంటి నుంచి ఖాళీ చేయించినట్లు సమాచారం.



## హెడ్ గర్ల్, హెడ్ బాయ్ ఎన్నిక



దుండిగల్: బౌరంపేట్‌లోని నారాయణ పాఠశాలలో శనివారం ఇన్వెస్టిచర్ సెర్మనీ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యా సంస్థల కేపీహెచ్‌బీ జోన్ ఏజీఎం వైజయంతి హెడ్ గర్ల్, హెడ్ బాయ్‌లతో పాటు వివిధ తరగతుల లీడర్లకు బ్యాడ్జీలు అందజేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దూలపల్లిలోని చెరువులో ఓ మహిళ మృతదేహం తేలడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు. మృతురాలి వయస్సు 50–60 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆకుపచ్చని చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందని, కుడి చేతిపై బాలయ్య అనే పచ్చబొట్టు, ఎడమ చేతిపై సైతం పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మూడు, నాలుగు రోజుల క్రితం చెరువులో పడి ఉంటుందని, ఎవరైనా హత్య చేసి పడేశారా?, ఆత్మహత్య చేసుకుందా? అన్న విషయాలు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలనున్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ఘనంగా బోనాల ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం పాఠశాలల్లో బోనాల సంబురాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో సందడి చేశారు. చిన్నారులు పోతరాజుల వేషధారణలో చిందులు వేశారు. దీంతో పాఠశాలల్లో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది..



చింతల్ సాగర్ ఎన్‌క్లేవ్‌లోని శ్రీ విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు



సుచిత్రలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో..



చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో..



గాజులరామారం శ్రీనిధి గ్లోబెల్ స్కూల్‌లో..



జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో..



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో..



భవిష్యవాణి వినిపిస్తున్న విద్యార్థిని

## సెయింట్ మార్టిన్స్‌లో జాతీయస్థాయి హ్యాకథాన్



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ 'క్వాంటానోవా'ను సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సీఈవో డాక్టర్ శ్రీరామ్ ప్రారంభించారు. 24 గంటల పాటు జరిగే ఈ హ్యాకథాన్‌లో 22 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 500 విద్యార్థులు పాల్గొననున్నారు. రియల్ వరల్డ్ ప్రాబ్లమ్స్‌కు పరిష్కారం చూపేందుకు ఈ హ్యాకథాన్ దోహదపడనుందని నిర్వాహకులు తెలిపారు. యువత తమ మెదడుకు పదును పెట్టి సమస్యకు పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ఇది వేదిక అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని అభయాంజనేయ స్వామి, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రముఖ ప్రవచనకర్త రాయపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రామాయణం, భగవద్గీతలపై ప్రవచనం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

# నకిలీ కాల్ సెంటర్ ముఠా అరెస్ట్

- 9 మందిని అరెస్ట్ చేసిన ఎస్ఓటీ, సైబర్ క్రైమ్ పోలీసులు
- 22 ఫోన్లు, 10 ల్యాప్ టాప్‌లు స్వాధీనం

నిజాంపేట్: నకిలీ కాల్ సెంటర్‌ను నడుపుతూ భారతీయులను, అమెరికాన్ పౌరులను మోసం చేస్తున్న తొమ్మిది మందిని ఎస్ఓటీ, సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 మంది కలిసి ఓ ముఠాగా ఏర్పడి నకిలీ కాల్ సెంటర్ నిర్వహిస్తున్నారు.పే పాల్, గీక్ స్క్వాడ్ క్రెడిట్ కార్డు సంస్థల పేరుతో బాధితులను మోసం చేస్తూ భారతదేశం, అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని మోసాలను పాల్పడుతున్నారు. సమాచారంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ, సైబర్ క్రైమ్ పోలీసులు జాయింగ్ ఆపరేషన్ నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. బాచుపల్లిలో ఓ విల్లాను అద్దెకు తీసుకుని ఈ కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. తొమ్మిది మంది కోల్‌కత్త పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు. ఈ ముఠాకు చెందిన మరో టీమ్ బాధితుల లావాదేవీల విషయంలో సహాయం కోసం ఫోన్లు చేయాలని మెయిల్స్ పంపేవారు. దీంతో వాయిస్ కాల్స్, జయిపర్, ఎక్స్‌లైట్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ యాప్స్ నుంచి బాధితుల నుంచి నకిలీ కాల్ సెంటర్ కాల్స్ రిసీవ్ చేసుకునేవారు. బాధితులు కాల్స్ చేసిన సమయంలో ఇంగ్లీష్‌లో స్క్రిప్ట్ ఆధారంగా బాధితులకు నమ్మకం కలిగే విధంగా మాట్లాడేవారు. ఎనీ డెస్క్ వంటి రిమోట్ యాక్సెస్ టూల్స్ ఇన్‌స్టాల్ చేయించి బాధితుల కంప్యూటర్స్‌లోకి ప్రవేశించేవారు. అనంతరం బ్యాంక్ అకౌంట్ వివరాలు, లావాదేవీల వివరాలు, అకౌంట్ పాస్‌వర్డ్‌లు సేకరించేవారు. అనంతరం బాధితుల అకౌంట్స్ నుంచి డబ్బులు దోచేసేవారు.నకిలీ బ్యాంకిగ్ యాప్‌లు, స్పూఫింగ్ ఈమెయిల్స్, సోషల్ ఇంజనీరింగ్ టెక్నిక్స్‌తో మోసాలకు పాల్పడటం ఈ ముఠా ప్రత్యేకం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలను టార్గెట్ చేస్తూ పోలీస్, కోర్టు అధికారులుగా నమ్మించి మోసం చేశారు. బాధితులు ఈ ముఠాకు సహకరించనప్పుడు డ్రగ్స్ ట్రాఫికింగ్, అశ్లీల ఫొటోలు లీక్ చేయడం, హ్యూమన్ ట్రాఫికింగ్ లాంటి అబద్ధపు కేసులతో బెదిరించేవారు. 9మందిని అరెస్ట్ చేయగా మరి కొంత మంది తప్పించుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దానిష్ ఆలం, మద్ నహెబ్ అలీ, మద్ ఫహాద్ పర్వేజ్, అమన్ ఆలం, ఇస్తియాక్ అహ్మద్, మహ్మద్ మోహ్సిన్, హుస్సేన్, షాదాబ్ ఆలం, సోను తదితరులను అరెస్ట్ చేశారు. వీరికి మంచి జీతంతో పాటు కమీషన్, ఉచిత వసతి లాంటి మోసపు మాటలను చెప్పి నమ్మించి ఈ ఉద్యోగంలోకి లాగినట్లు పోలీసుల విచారణలో తేలింది. అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి 22 మొబైల్స్, 10 ల్యాప్ టాప్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ బాలానగర్ శివకుమార్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, ఎస్ఓటీ బాలానగర్ ఎస్ఐలు గౌతమ్, రవికిరణ్, ఎస్ఐ సైబర్ క్రైమ్ చంద్రశేఖర్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ల్యాప్ టాప్‌లు